క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన టాకిరే సాయినాథ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి సోమవారం మాలీ సంఘం మండల నాయకులు రూ. 27 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాలీ సంఘం మండలాధ్యక్షుడు నికాడే గంగారం, సభ్యులు పాల్గొన్నారు.

షీ టీం ఆధ్వర్యంలో అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్, ఎన్టీఆర్ చౌక్‌లలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీ టీం ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో షీ టీం బృందం సభ్యులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం సేవల గురించి వివరించారు. మహిళలు, యువతుల రక్షణ కోసం షీ టీం పనిచేస్తోందన్నారు.

‘మాలీలకు ఎస్టీ హోదా ఇవ్వొద్దనడం సరికాదు’



మాట్లాడుతున్న నాయకులు

కెరమెరి: ఇటీవల మండలానికి చెందిన కొందరు ఆదివాసీ నాయకులు మాలీలకు ఎస్టీ హోదా ఇవ్వొద్దని ప్రకటించడాన్ని ఖండిస్తున్నామని మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశే శంకర్, మాలి పటేళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సెండే నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పలువురు మాలీ సంఘం నాయకులు ఉన్నారు.

వాహనాల అద్దె బిల్లులు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖకు అద్దె రూపంలో ఇచ్చిన వాహనాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వాహన యజమానులు శ్రీనివాస్, హుస్సేన్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఆర్‌వో సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు నెలల బిల్లులు రాకపోవడంతో వాహనాల ఫైనాన్స్‌లు చెల్లించలేకపోతున్నామన్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో పోచన్న, వసంత్, సుధాకర్, పవన్, ప్రదీప్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

సిర్పూర్(టి): వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై దీకొండ రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించి వాహన ధ్రువపత్రాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా వాహనాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాహన ధ్రువ పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు.

బాబా ధ్యాన మందిరం కోసం షెడ్డు నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: పూలాజీ బాబా ధ్యాన మందిరం కోసం షెడ్డు నిర్మించాలని కోరుతూ సోమవారం వాంకిడి మండలంలోని బంబారా గ్రామస్తులు ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ధ్యాన మందిరానికి షెడ్డు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దీపక్ ముండే, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చిత్ర పదర్శన

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల శ్రీనివాస(ఏషియన్) సినిమా థియేటర్లలో సోమవారం లాంఛనంగా గాంధీ చిత్ర ప్రదర్శన ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గర్మిళ్ల హైస్కూల్‌కు చెందిన 900మంది విద్యార్థులు వీక్షించారు. డీఈవో యాదయ్య, సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈవో పోచయ్య, పాఠశాల హెచ్ఎంలు శారద, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భూమిపూజతో సరి..!

- నిధులు మంజూరై ఏడాది
- ఇప్పటికీ ప్రారంభం కాని సులభ్‌కాంప్లెక్స్ పనులు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

తిర్యాణి: బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకూడదన్న ప్రభుత్వ ప్రకటనలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమలు కావడం లేదు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గత ఏడాది నిధులు మంజూరు కాగా అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేసి చేతులు దులుపుకున్నారు.

నిధులు మంజూరైనా..

మండలంలో 29 గ్రామపంచాయతీలు, 114 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మండలవాసులు అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజలు పడుతున్న తిప్పలుపై గతంలో పలుమార్లు ‘సాక్షి’లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో పాటు ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని గత ఏడాది ప్రభుత్వం గ్రామీణ నీటి పారుదల, పారిశుధ్యం (ఆర్‌డబ్ల్యూఅండ్ఎస్) శాఖ రూ.7లక్షల నిధులు మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ కూడా చేశారు. కానీ ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించ లేదు.

తప్పని ఇబ్బందులు..

వివిధ పనుల రీత్యా మండల కేంద్రానికి వచ్చే ప్రజలు అత్యవసర సమయంలో ఒంటికి, రెంటికి వెళ్లేందుకు చెట్లు, పుట్టలు, వాగులు, వంకలు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతీ శుక్రవారం నిర్వహించే వార సంతకు వచ్చే ప్రజలు, చిరు వ్యాపారులు సులభ్‌కాంప్లెక్స్ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంతకు వచ్చే మహిళలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌ను సమస్యపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వెంటనే నిర్మించాలి

మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఏడాది నిధులు మంజూరు కాగా నేటికీ పనులు ప్రారంభించలేదు. వెంటనే నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

- దురిశెట్టి సతీశ్, నాయకపుగూడ

వేధిస్తున్న లో ఓల్టేజీ!



ఎల్కపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

- కాలిపోతున్న వ్యవసాయ మోటార్లు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

పెంచికల్‌పేట్: విద్యుత్ సరఫరాలో నిత్యం లో ఓల్టేజీ సమస్య తలెత్తుతుండడంతో వరి పంట సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 15 రోజులుగా వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు బోర్లపై ఆధారపడి వరి నాట్లు వేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న లో ఓల్టేజీతో రైతుల మోటార్లు కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మండలంలోని 12 గ్రామపంచాయితీల్లో 541 వ్యవసాయ కనెక్షన్‌లు ఉండగా కొండపల్లి, లోడుపల్లి, ఎల్లూర్, పెంచికల్‌పేట్ గ్రామాల్లోని రైతులు నిత్యం సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

కాలుతున్న మోటార్లు..

మండలంలోని పెంచికల్‌పేట్, కొండపల్లి, లోడుపల్లి, ఎల్లూర్ గ్రామాల్లో రైతులు అత్యధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తున్నారు. అధికారులు ఎల్కపల్లి సబ్‌స్టేషన్ నుంచి ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఒక చోట విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. ఇప్పటి వరకు మండలంలో సుమారు 25 విద్యుత్ మోటార్లు కాలిపోయినట్లు రైతులు వాపోతున్నారు. సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న క్రమంలో లోఓల్టేజీతో మోటార్లు కాలిపోతుండడంతో అవస్థలు తప్పడం లేదన్నారు. మరమ్మతులకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయి. సాగు పనులు సాగుతున్న క్రమంలో నిత్యం ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలి.

- కారు ప్రకాశ్, రైతు, కొండపల్లి

కెపాసిటర్లు బిగించుకోవాలి

సబ్‌స్టేషన్ వద్ద ఎలాంటి లోఓల్టేజీ సమస్య లేదు. రైతులు మోటార్ల వద్ద ఆటో స్టార్టర్‌లు ఏర్పాటు చేసుకోవడంతో మోటార్లపై భారం పడి కాలిపోతున్నాయి. రైతులు ఆటో స్టార్టర్‌లను తొలగించి కెపాసిటర్లు బిగించుకుంటే విద్యుత్ మోటార్లకు ఎలాంటి నష్టం జరగదు.

- అంజల్‌కుమార్, విద్యుత్ ఏఈ, పెంచికల్‌పేట్

శివమల్లన్న ఆలయంలో పూజలు



శివునికి ప్రత్యేక పూజలు చేస్తున్న బెంగాలీలు

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజీగాం శివమల్లన్న దేవాలయంలో చివరి శ్రావణ సోమవారం సందర్భంగా బెంగాలీలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేదపండితులు నరహరి శర్మ, అర్చకులు సంతోశ్ శర్మల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, ఈవో వేణు గోపాల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని, పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ఈ నెల 25 నుంచి 27 వరకు హన్మకొండలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం జిల్లా సహాయక కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు సతీశ్, పురుషోత్తం, నిఖిల్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ స్కీంలో పని చేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌హెచ్ పథకంలో పని చేస్తున్న ప్రతీ ఒక్కరిని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖలో ఏళ్లుగా పని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కీంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్ఎంలతో పాటు ఇతర సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేకుంటే బుధవారం నుంచి సమ్మె చేపడుతామని హెచ్చరించారు. నాయకులు మధుకర్, బాపు, ముస్తాక్, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు కాగజ్‌నగర్‌కు ప్రవీణ్ కుమార్ రాక

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరు కానున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి బహుజన రాజ్యాధికార యాత్ర



మాట్లాడుతున్న తాలుకా అధ్యక్షుడు రాంప్రసాద్

దహెగాం: మండలంలో బహుజన రాజ్యాధికార యాత్ర బుధవారం నుంచి కొనసాగుతుందని బీఎస్పీ తాలుకా అధ్యక్షుడు కొండా రాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16 నుంచి మూడు రోజుల పాటు బహుజన రాజ్యాధికార యాత్ర ఉంటుందన్నారు. యాత్రలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొంటారన్నారు. పార్టీ కార్యకర్తలు భారీగా పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు దుర్గం దేవిదాస్, నాయకులు శంకర్, మహేందర్, నవీన్, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా పరిసర ప్రాంత కాలనీ వాసులకు వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, క్లాత్ జాబ్ బంజారా బ్యాగ్స్ మేకింగ్ కోర్సులు నేర్చుకోవడానికి ఉద్యోగుల డిపెండెంట్స్, మాజీ ఉద్యోగుల డిపెండెంట్స్, భూ నిర్వాసిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాటు పూర్తి వివరాలతో ఈ నెల 20లోగా ఏరియా జీఎం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

భీమిని: ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. భీమిని మండల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ప్రతి గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శించాలని పేర్కొన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, 100డయల్ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తాండూర్ సీఐ శ్రీనివాస్‌రావు, భీమిని ఎస్సై మహేందర్, పోలీసులు ఉన్నారు.

ఎంపీపీకి మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్‌ను సోమవారం రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు పరామర్శించారు. ఎంపీపీ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి వెంట నాయకులు తిరుపతి, రవీందర్‌గౌడ్, బాపు, ఆత్మరాం, గోపాల్, రమేశ్, తదితరులు ఉన్నారు.

ఉదారత చాటుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు



అంబులెన్స్‌లో తరలిస్తున్న కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్: ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఉదారత చాటుకున్నారు. బెజ్జూర్ మండలం పాపంపేట గ్రామానికి చెందిన యువకుడు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కోనేరు కృష్ణారావు సోమవారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలించారు. మెరుగైన వైద్యం అందజేయాలని మంచిర్యాల వైద్యులకు ఫోన్‌లో సూచించారు.

మానిక్‌రావు ఠాక్రేను కలిసిన గణేశ్ రాథోడ్



మానిక్‌రావు ఠాక్రేతో రాథోడ్ గణేశ్

ఆసిఫాబాద్: తెలంగాణ పీసీసీ సభ్యుడు రాథోడ్ గణేశ్ సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మానిక్ రావు ఠాక్రే, రోహిత్ చౌదరి, భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు వివరించినట్లు గణేశ్ రాథోడ్ తెలిపారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు గడ్డల సత్తయ్య, ఇస్మాయిల్, ప్రసాద్, నిజాం, రమేశ్, శేక్ ఖాన్, బాబూపఠాన్, సాజిద్ తదితరులు ఉన్నారు.

‘బీసీలపై ప్రభుత్వం చిన్నచూపు’



మాట్లాడుతున్న రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్: బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ ఆరోపించారు. ఆసిఫాబాద్ మండలం ఎల్లారంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కొంతమందికే రూ.లక్ష సాయం ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. బీసీలందరికీ రూ.10లక్షలు ఇచ్చేవిధంగా బీసీబంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, మారుతి తదితరులు ఉన్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన



వాంకిడిలో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

వాంకిడి: మండలంలోని సోనాపూర్ గ్రామ పంచాయతీలో గృహలక్ష్మికి దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీవో శివకుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి వివరాలు, గతంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారా.. లేదా.. అనే అంశాలతో పాటు ఇల్లు కట్టుకునేందుకు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి విలాస్ తదితరులు ఉన్నారు.

దహెగాం: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇంటింటికి వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నారు. సోమవారం మండలంలోని చౌక, లగ్గాం గ్రామాల్లో ఎంపీడీవో బృందం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు పరిశీలించారు. మండలంలో ఐదు బృందాలు వివరాలు పరిశీలిస్తున్నాయని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు.

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రపూర్, కర్జవెల్లి, బాలాజీ అనుకోడ గ్రామపంచాయతీల్లో సోమవారం గృహలక్ష్మీ పథకానికి దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఎంపీవో సుధాకర్ రెడ్డి పరిశీలించారు. దరఖాస్తుల ఆధారంగా పరిశీలించి వివరాలు నమోదు చేశారు. అర్హుల జాబితా రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు.

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సోమవారం అధికారులు పరిశీలించారు. ఎంపీవో మౌనిక, పంచాయతీ కార్యదర్శి సాయిక్రిష్ణలు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు.



దహెగాం: పరిశీలిస్తున్న ఎంపీడీవో



చింతలమానెపల్లిలో..

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సక్కు

కెరమెరి: మండలంలోని నాగల్‌గొంది గ్రామానికి చెందిన పోతురాజు, ధర్మరాజు ఆలయ కటోడా సిడాం రాజు మృతి చెందగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం పెద్ద సాకడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. చింతకర్ర గ్రామాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచ్ మధుకర్, నాయకులు భీంరావు, సిడాం ధర్ము ఉన్నారు.

ముసలమ్మగుట్ట శివాలయంలో బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామసమీపంలోని ముసలమ్మ గుట్ట శివాలయంలో సోమవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు.